
ప్రజాశక్తి
బుధవారం 15 నవంబర్ 2023





## రహదారి పనులు వేగంగా పూర్తి చేయండి

### ఐటిడిఎ ఇఇన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో ఐటిడిఎ ఆధ్వర్యంలో రూ.2కోట్లతో చేపడుతున్న రహదారులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఐటిడిఎ ఇఇన్ సి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని చొక్కాపువానివలస. నుండి బోతాడవలస,. వేటగాని వలస నుంచి పొలంవలస, మోసూరు నుండి గంగన్నదొర, కోనవలస గ్రామాల మధ్య ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇఇ శాంతీశ్వరరావు. డిఇ మణిరాజు, జెఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

# జిజిఎంపి నిధులు సిద్ధం

## పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గడప గడపకు మన ప్రభుత్వం (జిజిఎంపి) కార్యక్రమం కింద మంజూరు చేసిన నిధులు రూ.29 కోట్లు జిల్లాలో ఉన్నాయని, తక్షణమే పనులు పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జిజిఎంపి పనులు పూర్తి చేసి బిల్లులు అప్ లోడ్ చేసిన వెంటనే చెల్లింపు జరుగుతోందని అన్నారు. బిల్లులు అప్‌లోడ్‌లో జాప్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా, మండల అధికారులతో వివిధ అంశాల పట్ల మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాలకొండలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యతా భవనాలు, గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ రుణాలు అందించాలన్నారు. పిఎంఎవై డాష్ బోర్డ్ లో ఫోటోలు అప్ లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే బాలింతలు, గర్భిణీలు, బాలికలు, పిల్లల్లో రక్తహీనత ఉన్న వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాఠశాలల ప్రత్యేక అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అసైన్డ్ భూముల సాగుదారులకు భూహక్కులు కల్పించేందుకు రూపొందించిన పథకానికి అర్హులైన లబ్దిదారులకు పట్టాలు, ఎఫ్ఎంబి, టైటిల్ మొదలైన పత్రాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈనెల 17న ముఖ్యమంత్రి ప్రారంభించే ఈ కార్యక్రమానికి, జిల్లాలో జాబితా పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. ఓటరు జాబితా పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు. అర్హమైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండాలని, దానిని పక్కాగా తనిఖీ చేయాలని ఆయన సూచించారు.

సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాధరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.



వాసుదేవ్ ఆచార్యకు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

## వాసుదేవ్ ఆచార్య మృతి తీరని లోటు

ప్రజాశక్తి - కలెక్టరేట్

వాసుదేవ్ ఆచార్య లేని లోటు ప్రజాఉద్యమానికి తీర్చలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. వాసుదేవా ఆచార్య మరణానికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. సిపిఎం మాజీ ఎంపీ, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు వాసుదేవ ఆచార్య సోమవారం హైదరాబాద్‌లో మరణించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి సిపిఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాటాడుతూ కార్మిక, పేద ప్రజల గొంతు పార్లమెంటులో వినిపించారని, పార్టీ ఉద్యమంలో అతనిలోటు పూడ్చలేనిదని తెలిపారు. అతని ఆశయాలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకలు కె.అవినాష్, వై.మన్మధరావు, మండంగి శ్రీను, వి.ఇందిర, వెంకట్రావు, వాసు, మండంగి రమణ తదితరులు పాల్గొన్నారు.

# చేసిన మోసం చాలదని

- 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరిట బిజెపి ప్రచారం
- నేడు గుమ్మలక్ష్మీపురం నుంచి శ్రీకారం



**చేసిన మోసం సరిపోదన్నట్టుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరో మోసకారి ప్రచారానికి తెరలేపింది. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరిట కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే పేరుతో గిరిజనులను మభ్యపెట్టి, ఎన్నికల అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు సన్నద్ధమౌతుంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రం నుంచి ఈ ప్రచార కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టి సుమారు తొమ్మిదిన్నరేళ్లు కావస్తున్న విషయం విధితమే. ఏటా కోటి ఉద్యోగాలు, సగటు ఆదాయం రెట్టింపు, మహిళా సాధికారత, నల్లధనం వెలికితీత, వెలికి తీసిన నల్లధనమంతా ప్రజలకు పంపకం వంటి ఎన్నో హామీలు ఇచ్చిన విషయం తెలిసిందే. వీటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. కనీసం రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలైనా నెరవేర్చకపోతుందా అని ఎదురు చూసినవారికి నిరాశే ఎదురైంది. రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ లేదు. ఉత్తరాంధ్రకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ రెండేళ్లకే ఎత్తుగట్టారు. విశాఖ రైల్వే జోన్ ఊసేలేదు. ఉన్న వాల్తేరు డివిజన్‌కు ఎసరుపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మన జిల్లాకు ప్రకటించిన గిరిజన విశ్వవిద్యాలయానికి నేటికీ సొంత భవన సముదాయం నిర్మించలేదు. పైగా ఉత్తరాంధ్ర గుండె చప్పుడు లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం తహతహ లాడుతోంది.

ముఖ్యంగా కొండకొనల్లో నిక్షిప్తమైవున్న బాక్సైట్, గ్రానైట్ తదితర గనులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు గిరిజనులను అడవి నుంచి దూరం చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నించింది.

అందులో భాగంగానే సాలూరు మండలం తామరకొండ, పార్వతీపురంలోని బోడికొండలోని బాక్సైట్‌ను వేర్వేరు కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నించింది. సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన పెద్దఎత్తున పోరాడడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ ఇంకా బిజెపి ప్రభుత్వం నుంచి ముప్పు పొంచివుంది. అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికీ 10ఎకరాల వరకు పోడు భూములు ఇవ్వాల్సివున్నప్పటికీ బిజెపి అధికారంలోకి వచ్చాక మీనమేషాలు లెక్కిస్తోంది. మన్యం జిల్లాలో ఇంకా వేలాది గిరిజన కుటుంబాలకు సెంటు భూమి కూడా ఇవ్వలేదు.

ఇచ్చిన చోట కూడా 2ఎకరాల నుంచి 2.50ఎకరాలకు మించి ఇవ్వడం లేదు. గిరిజన ప్రాంత భూములు గిరిజనేతరుల పరం కాకుండా రూపొందించిన 1/70 చట్టాలను సైతం నీరుగార్చే వివిధగా అనేక బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేపెట్టింది. గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో, గిరిజనులు నిత్యం సంతల్లో దోపిడీకి గురౌతున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో దేశవ్యాప్తంగా గిరిజనుల్లో బిజెపిపై తీవ్ర వ్యతిరేకత పెరిగింది. మన జిల్లాలో బిజెపికి ఏమంత బలం లేకపోయినప్పటికీ తన రాజకీయ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు పావులు కదుపుతోంది. అందులో భాగంగానే మన్యం జిల్లాను తొలి విడత ప్రచార జాబితాలో చేర్చింది. గిరిజనులకు చెప్పుకునేందుకు కూడా ఏమీ లేకపోవడంతో ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, ఫోషన్ శక్తి నిర్మాన్ అభియాన్, జన్‌ధన్ యోజన, ఉజ్వల తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారంతో గిరిజనులను మభ్యపెట్టేందుకు ప్రచారం చేసేందుకు సన్నద్ధమైంది.

**జిల్లాకు రెండు ఐఇసి వ్యాన్లు**

సంకల్ప యాత్ర కోసం మన్యం జిల్లాకు రెండు ఐఇసి వ్యాన్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అందులో అధునాతన సాంకేతిక పరికరాలతో కూడిన ఆడియో, వీడియో పరికరాలు ఉంటాయి. వాటి ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ సందేశాన్ని ప్రజలకు వినిపిస్తారు. వీటిపాటు మొత్తం 17 పథకాలతో కూడిన ప్రచార సామగ్రిని సిద్ధం చేశారు. కరపత్రాలు, బ్రోచర్లు గిరిజనులకు విరివిరిగా పంపిణీ చేసి గిరిజనులను ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఇందులో బిజెపి లేదా ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కూడా పాల్గొని వారి అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలిసింది.

**రోజుకు రెండు పంచాయతీల్లో ప్రచారం**

రోజూ రెండు పంచాయతీల్లో సంకల్ప యాత్ర సాగే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 పంచాయతీల్లో ఈనెల 15 నుండి 30 వరకు, కురుపాం మండలంలోని 23 పంచాయతీల్లో డిసెంబరు 1 నుండి 15వరకు, సీతంపేట మండలంలోని 53 పంచాయతీల్లో ఈనెల 15నుంచి డిసెంబరు 16వరకు షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నట్టు ఇటీవలే కలెక్టర్ ప్రకటించారు. ఈ యాత్రలో డిపిఒ జిల్లా నోడల్ అధికారిగా, డిఎంహెచ్ఒ, డిఎస్ఒ, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు, జిల్లా వ్యవసాయఅధికారి, జిల్లా ఉద్యానఅధికారి, జిల్లా మత్స్యఅధికారి, ఐసిడిఎస్ పిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ పాల్గొంటారని సమాచారం.

### అధికారులతో కలెక్టర్ సమావేశం

**పార్వతీపురం :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను షెడ్యూల్ తెగల ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 15న వికిసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయం నుంచి మండల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జిల్లా నోడల్ అదికారిగా జిల్లా పంచాయతీ అధికారిని, కార్యక్రమ నిర్వహణకు ఆహ్వాన, ఉత్సవ కమిటీలను జిల్లా వైద్య అధికారి, జిల్లా సప్లయి అధికారి, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు, జిల్లా వ్యవసాయఅధికారి, జిల్లా ఉద్యానఅధికారి, జిల్లా మత్స్యఅధికారి, ఐ.సి.డి.ఎస్. ప్రోజెక్టు అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని నియమించినట్టు తెలిపారు. పథకాలకు సంబంధించిన శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, ఎంపిడిఒలు కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, లబ్దిదారుల వీడియోలను సంబంధిత పోర్టలు నందు అప్లోడ్ చేయాలని తెలిపారు.

### యాత్ర ఏర్పాట్లు పిఒ పరిశీలన

**గుమ్మలక్ష్మీపురం:** విక్షిత్ భారత్ సంకల్ప యాత్రను బుధవారం గుమ్మలక్ష్మీపురంలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ సభా ఏర్పాట్లకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో పాటు జిల్లాస్థాయి అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలో 27 పంచాయతీల్లో విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ, ఐకెపి ఎపిఎం ఆదయ్య, సర్పంచి బి గౌరీ శంకర్రావు ఉన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రమేదీ?

- సెప్టెంబర్ లోనే మొదటి పికింగ్
- ప్రయివేటు వ్యాపారులకే అమ్మకాలు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్ శాఖ

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గం పరిధిలో పత్తి కొనుగోలు కేంద్రం ఇంతవరకు ప్రారంభం కాకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెప్టెంబరులో పత్తి మొదటి సారి ఏరివేత ప్రారంభమవుతుంది. అంటే అప్పటి నుంచే రైతులు అమ్మకానికి సిద్ధంగా ఉంటారని తెలిసినా ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. అక్టోబరు, నవంబర్ నెలల్లో రెండోసారి ఏరివేత చేయడం కూడా జరిగింది. అయినా జిల్లా అధికారులు పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై దృష్టి సారించలేదు. ప్రతి ఏటా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం నామమాత్రంగా ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. గడచిన మూడేళ్లుగా ఇక్కడ ఆలస్యంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం, ఈలోగా రైతులు వ్యాపారులకు విక్రయించేయడం జరుగుతోంది. ప్రయివేటు వ్యాపారులు క్వింటాకు రూ.6వేల నుంచి రూ.6500 వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7020 అంటే రైతులు క్వింటాలుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయలు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. గత కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. నియోజకవర్గ పరిధిలో పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాల్లో అధిక విస్తీర్ణంలో పత్తి సాగవుతోంది. పాచిపెంట మండలంలో 2600ఎకరాలు, సాలూరు మండలంలో 1200 ఎకరాలు, మక్కువ మండలంలో 600ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. కాటన్ కార్పొరేషన్ ఏటా ఇక్కడ ఎఎంసి యార్డ్‌లో కొనుగోలు ఏర్పాటు చేసినట్లు బోర్డు పెట్టి వదిలేస్తుంది. ఈ క్రాప్ నమోదు, తేమ శాతం వంటి నిబంధనలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మకానికి గుదిబండగా వుంటాయనే కారణంతో రైతులు ప్రయివేటు వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తారనే నమ్మకం లేకపోవడంతో రైతులు ఏదో ఒక ధరకు సర్దుకుని తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభంలోనే సిసిఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ఇక్కడ సీజన్ చివరి వరకు ప్రారంభించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



దళారుల వద్దకు పత్తిని తరలిస్తున్న రైతులు

### జిన్నింగ్ మిల్లుతో సిసిఐ అధికారుల కుమ్మక్కు

విజయనగరం జిల్లా రామభద్రపరం మండలంలోని ముచ్చర్లవలసలో పత్తి జిన్నింగ్ మిల్లు గత కొంతకాలంగా నడుస్తోంది. ఈ ప్రాంతంలో పండించిన పంట అంతా వ్యాపారుల ద్వారా ఈ మిల్లుకే చేరుతోంది. సిసిఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కు కారణంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఆలస్యంగా ప్రారంభిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. రైతుల నెత్తిన శఠగోపం పెడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు అందని ద్రాక్షలా తయారైంది. క్వింటాకు రైతులు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్నారు. దళారీల వలలో రైతులు విలవిలాడుతున్నారు.

# తాగునీటి సరఫరాపై అధికారుల నిలదీత

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో తాగునీరు సరఫరాలో జరుగుతున్న తీరుపై సిపిఎం పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా మహేశ్వరరావుతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్, మజ్జి శశికర్ మున్సిపల్ డిఇ కిరణ్‌కుమార్‌ను నిలదీశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తూ డిఇకి వినతిని అందజేశారు. తాగునీటి సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పట్టణ ప్రజలకు నాలుగు రోజులకు, ఐదు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా జరుగుతుందని, సరఫరా కూడా అరకొరగా ఇస్తున్నారని, దుర్వాసనతో కూడుకున్న నీళ్లు కొన్ని వార్డుల్లో వస్తున్నాయని తెలిపారు. వీధుల్లో ఉన్న బోర్లు ద్వారా కూడా అంతంత మాత్రమే నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో 70 శాతం మంది ప్రజలు మున్సిపాల్టీ సరఫరా చేసే నీళ్లపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. దీపావళి రోజున కూడా మంచినీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో మున్సిపాల్టీ ఉందన్నారు. సుమారు రూ.63 కోట్లతో సమగ్ర మంచినీటి పథకం పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఎందుకు పనులు నిలిపివేశారని ప్రశ్నించారు. పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎన్నిసార్లు, ఎంతమందికి చెప్పినా సమస్య తీరడం లేదని, సమస్య పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టి పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాను అందించకపోతే పట్టణ ప్రజల్ని కదిలించి పెద్దఎత్తున ఆందోళన చేసి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముట్నూరు వెంకటరమణ, శిరేల శ్రీను, పొన్నాడ శ్రీను, బూర్లి వెంకటేష్, కొత్తగుండు గణేష్, ముట్నూరు లక్ష్మీ నరసింహామూర్తి, మాడుగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యను మున్సిపల్ డిఇకి వివరిస్తున్న సిపిఎం నాయకులు

# ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలి

## ఘనంగా 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు గ్రంథాలయాలు ప్రధానపాత్ర పోషిస్తాయని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ బివి పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏకలవ్య పాఠశాలలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం, బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలను వేసి, నివాళ్లు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు గ్రంథాలయాలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ ప్రతి ఒక్కరికి పుస్తక పఠనం తప్పనిసరి అని తెలిపారు. సమాజంలో గొప్ప వ్యక్తులుగా ఎదగాలంటే జ్ఞాన సంపద అవసరమని, పుస్తక పఠనం ద్వారానే అది సాధ్యపడుతుందని వివరించారు. ఎపి గ్రంథాలయ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.పారినాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకోవాలని, ఇందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. భారతీయ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, ఆరోగ్య పునర్వికాసానికి, ప్రకృతి వ్యవసాయమే ఆధారం అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు టి.శివకేశవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సాలూరు:** గ్రంథాలయాలను యువత వినియోగించుకోవాలని ఎంఇఒ దాసు కోరారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వేదసమాజం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ ఎం నాగేశ్వరరావు,శాఖా గ్రంథాలయం అధికారిణి పాల్గొన్నారు.

**వీరఘట్టం:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కలియుగ భీముడు కోడి రామ్మూర్తి నాయుడు మనవడు కోడి వెంకటరమణ నాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం వెంకటేశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

**పార్వతీపురం టౌన్ :** పట్టణంలోని నెయ్యిల వీధిలో ఉన్న శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వారోత్సవాలను ప్రముఖ బాల సాహిత్య వేత్త బి.ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ.ధర్మారావు, ఆడబడి ప్రాథమిక పాఠశాల, ఎంఇఒ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్‌రావు, కె.శ్రీనివాసరావు, విశ్రాంత టీచర్ ఎ.మిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బివిపట్నాయక్

**సీతానగరం :** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంఇఒ జి.సూర్యదేవుముడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ అధికారి టి.వెంకటరావు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి :** స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, సర్పంచ్‌కలిసే ఇందుమతి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి నల్ల మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సీతంపేట :** స్థానిక శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి ప్రారంభించారు. ముందుగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

**పాలకొండ :** స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను చిన్న మంగళాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జామి రవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ పోటీ పరీక్షలకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ శివకృష్ణ, భాస్కర్‌రావు, చందు, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు డి.సుకన్య గ్రంథాలయాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పక్కా ఓటరు జాబితా తయారు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఓటరు జాబితాలో ఎటువంటి తప్పిదాలు లేకుండా పక్కాగా తయారు చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. మరణించిన వారి ఓటర్ల ను నిబంధనల మేరకు తొలగించాలని అన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ కుమారి, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## 17న సాలూరులో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - పార్వతీపురం

మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం సాలూరు మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు.

## విక్రాంత్‌కు సహాయ మంత్రి హోదా

**పార్వతీపురం :** శాసన మండలి విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు రాష్ట్ర ప్రభుత్వం సహాయ మంత్రి హోదా కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.ముత్యాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. సహాయ మంత్రి హోదాలో ప్రోటోకాల్ పాటించాలని ఆదేశాలు జారీ చేశారు

## వెంకటాపురం సమీపాన ఏనుగుల గుంపు సంచారం

**కురుపాం:** జియ్యమ్మవలస మండలం వెంకటాపురం సమీపంలో మంగళవారం ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తూ సమీప పంట పొలాలను, చెరుకు, అరటి తోటల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆ గ్రామాల రైతులు మాట్లాడుతూ ఇంతవరకు ప్రశాంతంగా ఉంటూ పంటలను సాగు చేసుకుంటున్న సమయంలో ఏనుగులు తమ గ్రామాల మధ్య సంచరిస్తుండంతో ఏ క్షణాన ఏం జరుగుతుందని భయభ్రాంతులకు గురవుతున్నామని చెబుతున్నారు. కావున సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి మా ప్రాంతం నుండి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించి తమ పంటలను తమ ప్రాణాలను కాపాడాలని కోరుతున్నామన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్

## అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని కొంకడవరం బిసి కాలనీకి చెందిన అల్లు పోలినాయుడు, సావిత్రమ్మ ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. ప్రమాదంలో బాధితులు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. పోలినాయుడు కుమారుడు గౌరి నాయుడు చదువుకున్న ధ్రువపత్రాలు కూడా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు స్పందించి మంగళవారం ప్రమాద బాధితులకు వంట సామగ్రి, నిత్యవసర వస్తువులు, తాత్కాలికంగా వారు నివసించడానికి టార్పన్, దుస్తులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో కొంకడవరం సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గొర్లి అప్పలరాజు, కోలా సీతారాం (రిటైర్డ్ డైరెక్టర్), బొండపల్లి వెంకటరమణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు జోటు రామకృష్ణ, జిల్లా కో ఆర్డినేటర్ యమ్మల జనార్దనరావు పాల్గొన్నారు.



కార్యాలయంలో అధికారుల్లేక ఖాళీగా ఉన్న కుర్చీలను చూపుతున్న కౌన్సిలర్లు

## సమస్యలు చెప్పకుందామంటే అధికారుల్లేరు...

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమ వార్డుల్లోని సమస్యలను మున్సిపల్ అధికారులకు విన్నవించుకుందామంటే కార్యాలయంలో అధికారులెవరూ లేని పరిస్థితి మంగళవారం నెలకొంది. 25, 28 వార్డుల కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్, మజ్జి శశికర్ తమ వార్డులోని సమస్యలను వివరించేందుకు ఆయా విభాగాల అధికారుల వద్దకు వెళ్లి చూడగా విధుల్లో ఉండాల్సిన అధికారులు మధ్యాహ్నం 12 గంటల వరకు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25వ వార్డులో తాగునీటి సమస్యపైన, 28వ వార్డులో నాలుగు నెలల క్రితం ప్రారంభమైన సిసి రోడ్డు నిర్మాణ పనులు, తాగునీటి పైపు లైన్ పనులను అసంపూర్తిగా నిలిచివేయడంపై అధికారులను అడిగిందేకు వచ్చారు. తీరా సంబంధిత అధికారులెవరూ లేకపోవడంతో నిరాశతో వెనుదిగారు.

## మంజూరైన రుణాలపై ఆడిట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో మంగళవారం డిపిఎం ఫైనాన్స్ అధికారి జి.అప్పారావు, ఎల్‌సిఎన్ రాజారావు ఆధ్వర్యంలో ఎంఎంఎస్, ఎఫ్‌పిఒఎఫ్ ద్వారా ఇచ్చిన రుణాలపై ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించారు. ఎంఎంఎస్ ద్వారా రూ.2.5కోట్లు, ఎఫ్‌పిఒ ద్వారా రూ.కోటీ 28 లక్షలు వివిధ రూపంలో లబ్ధిదారులకు ఇచ్చిన రుణాలకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు జరుగుతున్న లావాదేవీలు గూర్చి ఆడిట్ చేసినట్లు ఫైనాన్స్ అధికారి జి.అప్పారావు తెలిపారు. రిసీట్ బుక్, బ్యాంకు పుస్తకాలు, తీర్మానాల రికార్డు తదితరమైనవి తనిఖీలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పార్వతీపురం, బలిజిపేట, గరుగుబిల్లి, వీరఘట్టం, సీతానగరం మండలాల్లో ఆడిట్ పూర్తయినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షులు పి.సుజాత, చేయూత ఎపిఎం ఎ.సతీష్, ఎఫ్‌పిఒ మాజీ అధ్యక్షులు గొర్లె బలరాం, ఎఫ్‌పిఒ సిసి వై.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి -భామిని

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అందజేస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని బాలేరులో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలందాలని, పంచాయతీలో పూర్తి స్థాయిలో విద్య, వైద్య, మౌలిక సదుపాయాలు కల్పన దిశగా, ప్రజలు భాగస్వామ్యంతో ప్రభుత్వం ద్వారా పంచాయతీలు అభివృద్ధి చేసేందుకే సచివాలయం, వాలంటీర్ వ్యవస్థలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న ఎంపిడిఒ

## విశ్వంభరపురంలో దాహం కేకలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం పంచాయితీ విశ్వంభరపురంలో గత 20రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఆ గ్రామ మహిళలు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపిడిఒ అకిబ్‌జావేద్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 80 కుటుంబాలకు పైగా నివసిస్తున్న గ్రామానికి ఆధారమైన రక్షిత మంచినీటి పథకం తరచూ మరమ్మతులకు గురికావడంతో తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే తాత్కాలికంగా పనులు చేపడుతున్నప్పటికీ పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని తెలిపారు. కావున అధికారులు ఈ సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వెంటనే ఎంపిడిఒ స్పందిస్తూ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు.

## బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీ పరిధిలో గల క్లాప్ వాహనాలను నడుపుతున్న 11మంది డ్రైవర్లు తమకు మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని మంగళవారం స్థానిక మున్సిపల్ అధికారులను వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి 30 వార్డుల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ కు ప్రతిరోజు తరలిస్తున్నామని, గత మూడు నెలలుగా తమ జీతాలను సంబంధిత కాంట్రాక్టర్ చెల్లించడం లేదని, ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ తెలిపినా, ప్రతినెలా సంబంధిత కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించడం జరుగుతుందని చెబుతున్నారని అన్నారు. కాంట్రాక్టర్ మాత్రం తమకు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు సకాలంలో చెల్లించకపోతే విధులకు హాజరు అవ్వడం జరదని అన్నారు.

## నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

**వీరఘట్టం :** మండలంలోని నడుకూరులో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.

# ఘనంగా బాలల దినోత్సవం

**భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో పలు చోట్ల బాలల దినోత్సవాలు నిర్వహించారు. పాఠశాలల్లో, ప్రైవేట్ సంస్థల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల విద్యార్థులచే ర్యాలీ, దేశ నాయకుల వేషధారణలు చేపట్టారు.**

**కురుపాం :** ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని మాదలింగి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవానికి ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువు అంటే కేవలం పుస్తకాలు చదవడమే కాదని, ఆటలు, పాటలు, చిత్ర లేఖనం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యలో భాగమేనని అన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండి పుస్తకానికి దగ్గర అవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఎస్ సొసైటీ కార్యదర్శి గౌస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో...**

మండల కేంద్రంలో గల అంగన్వాడీ కేంద్రం - 3లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఒ కె.విజయగౌరి బాలల దినోత్సవం గూర్చి, పిల్లల పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి ఐసిడిఎస్ ద్వారా అందిస్తున్న సేవలు అన్ని సక్రమంగా సమయానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు వివి రమణమ్మ, శ్రావణి, గౌరి, అంగన్వాడీ కార్యకర్తలు జి.సరోజ, శోభారాణి, సూర్య కుమారి పాల్గొన్నారు.

**దేశ నాయకుల వేషధారణలో గాయత్రి స్కూల్ విద్యార్థులు**

**పార్వతీపురం టౌన్ :** పట్టణంలోని గాయత్రి స్కూల్లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బాలల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పాఠశాలలో ఉన్న పలువురు విద్యార్థులు దేశ నాయకులు జవహర్లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, ఝాన్సీరాణి, భారతమాత, తదితర వేషధారణలు స్కూల్ కరస్పాండెంట్ పివికె మణికుమార్‌తో పాటు ఉపాధ్యాయులను, స్థానికులను ఆకట్టుకున్నాయి.

**పాలకొండ:** మండలంలోని ఓని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వమించారు. పాఠశాల హెచ్‌ఎం బలగ నాగమణి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోగుల సూర్యనారాయణ, పాలవలస శారదాకుమారి, సిద్ధాబత్తుల వెంకటరమణ, కుదమ తిరుమలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వీరఘట్టం :** మండలంలోని బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంబరవలస పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.పైడిరాజు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సీతంపేట :** మండలంలో పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్ ఆదిలక్ష్మి, హెచ్‌ఎం ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యం నాయుడు పాల్గొన్నారు. అలాగే సీతంపేట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయులు లిల్లీరాణి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.





కురుపాం : బాలలనుద్దేశించి మాట్లాడుతున్న కవి గంటేడ గౌరునాయుడు





పార్వతీపురం : దేశనాయకుల వేషధారణలో గాయత్రి స్కూల్ విద్యార్థులు

**గుమ్మలక్ష్మీపురం :** మండలంలోని దిగుమండ ఎంపిపి పాఠశాలలో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మక సింహాచలం పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిజన విభాగం అధ్యక్షులు కిల్లక రాఘవేంద్రరావు, నాయకులు బిడ్డిక సూర్యం, మూటక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**సాలూరు:** బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు నెహ్రూకు నివాళి అర్పించారు.

**పాచిపెంట :** బాలల దినోత్సవం సందర్భంగా పాచిపెంట సరస్వతీ శిశు మందిర్ చిన్నారులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో గ్రామ పురవీధుల్లో చిన్నారులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గోతులను పూడ్చిన రిటైర్డ్ టీచర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గోతులను విశ్రాంత ఉపాధ్యాయుడు తూముల భాస్కరరావు మరమ్మతులు చేయించారు. సెప్టెంబర్ 25న ప్రజాశక్తిలో ప్రచురితమైన " ఫ్లైఓవర్ గోతుల్లో తేలిన ఇనుప గజాలు" అన్న వార్తకు ఆర్ అండ్ బి అధికారులు స్పందించనప్పటికీ పట్టణ నడిబొడ్డులో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గోతులను మంగళవారం నిర్వాసితుల కాలనీ అయిన నవిరికి చెందిన భాస్కరరావు తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టి ఆర్ అండ్ బి అధికారులను ఆశ్చర్యపడేలా చేశారు. ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రతిరోజూ వందలాది భారీ వాహనాలతో పాటు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయి. వై ఆకారంలో ఉన్న ఈ ఫ్లైఓవర్‌పై పలుచోట్ల గోతులు ఏర్పడి ఇనుప చువ్వలు బయటకు వచ్చి వాహనాల మరమ్మతులకు గురవుతున్నప్పటికీ నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సిన ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి పలువురు పలు సందర్భాల్లో తీసుకెళ్లినా కనీసం పట్టించుకోలేదు. దీంతో బ్రిడ్జిపై ఉన్న గుంతలను భవనిర్మాణ కార్మికులతో కప్పించడంతో మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్ అండ్ బి అధికారులను స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తూ, ఆ ఉపాధ్యాయుని అభినందించారు.



బ్రిడ్జిపై గొయ్యిలను పూడ్చుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కరరావు

## వరిచేలు కోయెుద్దు

ప్రజాశక్తి - సీతానగరం

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినందున రైతులు వరి చేలు కోయెుద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 16న వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

**ముమ్మరంగా వరికోతలు**

మరోవైపు వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మండలంలోని పెదఅంకలాం, లక్ష్మీపురం, బుడ్డిపేట, బూర్జ తదితర గ్రామాల్లో కోతలు కొనసాగుతున్నాయి. వెంటనే ధాన్యాన్ని కూడా అమ్మకాలు సాగుతున్నాయి. రైతు భరోసా కేంద్రాలు తెరిచేలోపే ధాన్యాలు కొంతమేరకు మార్కెట్‌కు తరలిపోతాయని రైతులు చెబుతున్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

## హామీలన్నీ అమలు చేశాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ తనను తాను నిరూపించుకుంటున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంగాపురంలో మంగళవారం నిర్వహించిన జగన్ ఎందుకు రావాలి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట కోసం ప్రతి ఒక్కరికీ, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ఇంతవరకు నవరత్నాల అమలు విధానం బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన ప్రజలు సంక్షేమ పథకాలు పొందారో, లేదో ఈ బోర్డుల ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. పార్టీ, కుల, మత వర్గ బేధం లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్ర అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న విషయాలను గమనంలో ఉంచుకొని మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని ముందుకు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు మురళి, సర్పంచ్ పాలవలస మురళి, తదితరులు పాల్గొన్నారు.

### చెరువు గండి పూడ్చివేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామవరం చెరువుకు పడిన గండిని గుత్తేదారు మంగళవారం పూడ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ చెరువుకు గండి పడడంతో రైతులు, మత్స్యకారులకు నష్టం వాటిల్లింది.

## మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశీలలో ఎన్‌ఆర్‌ఐ దాత సుధీర్ కుమార్ పట్టా సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా కుట్టు మిషన్లపై ఉచితంగా నాలుగు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలతో పాటు నిరుపేదలకు ఉచితంగా కుట్టు మిషన్లు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మహిళలకు శిక్షణతో పాటు కుట్టుమిషన్లు ఉచితంగా అందజేసిన సుధీర్ కుమార్ పట్టా సేవలు అభినందనీయమని అన్నారు. ఆయన ఎక్కడో ఉన్నా సరే ఇక్కడ మన గ్రామంతో పాటు ఈ చుట్టుపక్కల ప్రజల స్థితిగతులను మెరుగుపర్చేందుకు చేస్తున్న కృషి శ్లాఘణీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ అవకాశాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామోలు పోలమ్మ, రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు ఎస్.కృష్ణ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అక్కేన సుందరనాయుడు, శిక్షకులు మాధురి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పారదర్శకత చూపేందుకే గడప గడపకు...

ప్రజాశక్తి -భామిని

ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించగలుగుతున్నామంటే, దానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందజేసిందని, ఇటువంటి పరిస్థితి రాష్ట్రం లో ఎన్నడూ లేదని , ప్రజలు ఆలోచించాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని బాలేరు సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీకు అందాయా లేదా అని, మీకు సంక్షేమ పథకాలు చేరడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బాలేరులో స్థానిక అవసరాలను ఎంఎల్ఎ వద్ద గ్రామస్తులు ప్రస్తావించగా అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ దెబ్బమానుగూడకు చెందిన భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో వైయస్సార్ బీమా తక్షణ సాయాన్ని సర్పంచ్ ఎ.మన్మధరావు, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేలు వైస్సార్ భీమా తక్షణ సాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో వారు మాట్లాడుతూ బీమా నగదును సద్వినియోగం చేసుకోవాలని, మిగతా నగదు కూడా వేగంగా అందేలా చూస్తామని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## నిమ్మలకు సమన్వయకర్త ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ నియోజకవర్గ జనసేన సమన్వయ కర్తగా నిమ్మల నిబ్రంను జనసేన అధినేత పవన్ కల్యాణ్, పిఎసిఎస్ చైర్మన్ నాదెండ్ల మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్‌కు పార్టీ క్రియాశీలక సభ్యులు ఎం.పుండరీకం, బిపి నాయుడు, జనసేన జానీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంతవరకు ఏ పార్టీ తగిన గుర్తింపు ఇవ్వలేదని, జనసేన ఆ స్థానం ఇచ్చిందని, నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న తెగలను, అన్ని వర్గాల వారిని కలుపుకొని జనసేన పటిష్ఠ పర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తామని, ఉమ్మడి కార్యాచరణ మేనిఫెస్టో ప్రజల్లో తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. కె.పవన్‌సాయి, డి.సతీష్, వి.చిన్నశరణ్, ఎ.సతీష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

**మల్లేశ్వరరావుకు సన్మానం**

**గుమ్మలక్ష్మీపురం :** కురుపాం జనసేన సమన్వయకర్తగా నియమించిన ఇరిడి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావుకు గుమ్మలక్ష్మీపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మారుమూల ప్రాంతమైన తనను గుర్తించి సమన్వయకర్తగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. జనసేన అభివృద్ధికి, గిరిజనుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డుమ్మంగి సర్పంచి పాలక క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : టిడిపి మేనిఫెస్టోను ఇంటింటికీ అందజేస్తున్న జగదీశ్వరి

## 'టిడిపితోనే గిరిజన జీవితాల్లో వెలుగులు'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే గిరిజన బతుకుల్లో వెలుగులు ఉంటాయని కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన రాయగడ జమ్ము పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం పెదరావికోన, పాముల గీసాడ, పెంగవ, గొరడ, రేగిడి గ్రామాల్లో బాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అడ్డాకుల నరేష్, దాసు, భూపతి దొర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

**టిడిపి లోకి 50 కుటుంబాలు చేరిక**

**సీతంపేట :** మండలంలోని కిండంగి పంచాయతీ పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, క్లస్టర్ ఇన్‌ఛార్జి నిమ్మక చంద్రశేఖర్, ఐటిడిఎ కోఆర్డినేటర్ హిమరిక పవన్, నిమ్మక కాంతారావు, సవర అనిల్, వివిధ గ్రామాల పెద్దలు, మహిళలు, మండల ముఖ్య నాయుకులు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి :** మండలంలోని నాగూరులో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి కె.చంద్రశేఖర్, బూత్ ఇన్‌ఛార్జి ఎ.జనార్దన్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలను పరిశీలించిన డిఐఒ

ప్రజాశక్తి - బలిజిపేట

బలిజిపేట, అరసాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో అందిస్తున్న ఆరోగ్య సేవలను ఆయా సిబ్బందితో చర్చించారు. అనంతరం ఒపి నిర్వహణ, ల్యాబ్ తనిఖీ చేసి ఏ విధమైన అనారోగ్య సమస్యలు నమోదు అవుతున్నాయి, వాటికి నిర్వహించిన పరీక్షలు పరిశీలించారు. పలు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించి ఫార్మాసిస్ట్‌కు తగు సూచనలు చేశారు. వార్డులు పరిశీలించారు. అరసాడ పిహెచ్‌సిలో ప్రసవించిన గర్భిణీ ఆరోగ్య స్థితిని పరిశీలించారు. ఆరోగ్య నివేదికల వివరాలు రికార్డులో పరిశీలించి పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ పిహెచ్‌సిల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని, పలు సమావేశాల్లో, ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. గర్భిణుల నమోదు త్వరగా జరగాలని తద్వారా సత్వరమే ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు జరిపి హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణీలకు టీకా నిర్వహణ పక్కాగా జరగాలన్నారు. జెఎఎస్‌లో గుర్తించిన రిఫరల్స్‌కు చికిత్స జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర చికిత్సకు అవసరమైన మందులు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ డి.కె. కిరణ్మయి, డాక్టర్ జి.శశిధర్, సూపర్‌వైజర్లు నారాయణరావు, కర్ణ, చంద్రావతి, జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి పద్ధతిలో పంటలు పండిస్తే వ్యాధులను దూరం చేయడమే కాకుండా, రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందని కృషి విజ్ఞాన కేంద్రం హెూమ్ సైంటిస్ట్ ఉమా జ్యోతి అన్నారు. మండలంలోని మండ ఎంపిపి పాఠశాలల విద్యార్థులు మంగళవారం కెవికెలో పండిస్తున్న పంటలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రకృతి వ్యవసాయ పంటలను పండించడం ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్యవంతంగా ఉండేందుకు వీలుంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం సాగు విధానాన్ని వివరిస్తూ తమ తమ గ్రామాల్లో సాగు చేసేలా విద్యార్థుల కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కిచ్చాడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడలో 104 ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మాదలింగి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ జ్వరాలు మలేరియా తదితర వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలని అలాగే కాచి, చల్లార్చిన నీళ్ల తాగుతూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**గుమ్మలక్ష్మీపురం :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాల్మన్‌రాజు తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

సీతంపేట మండలం గడగుజ్జి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. బాధితులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టంలో పని ముగించుకొని తమ స్వగ్రామైన జలబగూడ బి.అనంతరావు, జయరాజు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కోసంగిగూడ నుండి పి రమణారావు, సోమేశ్వరరావు ద్విచక్ర వాహనపై ఎదురుగా వచ్చి ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చల్లా చెదురు పడిపోవడంతో స్థానికులు 108కి సమాచారం అందించాడు. క్షతగాత్రులకు స్థానిక పిహెచ్‌సికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు

## 500లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కర్రివలస పంచాయతీ చాపరాయివలసకు చెందిన కూనేటి కిశోర్ నుంచి 500లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఫకృద్దీన్ తెలిపారు. కేసు సంబంధించిన వివరాలను తెలిపారు. కిశోర్ ఒడిశాలోని పొట్టంగి నుంచి ఆటో ద్వారా 25 క్యాన్లతో 500లీటర్ల నాటుసారా తీసుకొస్తున్నట్టు ముందస్తు సమాచారం తనతో పాటు సిబ్బంది రొడ్డవలస వద్ద జాతీయ రహదారిపై కాపుకాసి పట్టుకున్నట్టు తెలిపారు.